# కళ్ళకు సన్మానం

గంటి వెంకటరమణి

'నగుమోము కనలేని....' శ్రావ్యంగా, మంద్రంగా శాస్త్రీయంగా వినిపిస్తోంది. బయట హోరుగాలీ, ఎడతెరిపిలేని వర్షంతో ఏళ్ళూ వూళ్ళూ ఏకం అవుతున్నాయి. కరెంటు లేకపోవడంతో కాటుక పులుముకున్నట్లుంది కాలనీ మొత్తం. దోమల బాధ భరించలేక తలుపులు తీసి కూర్చున్నారు శ్రీధర్ ఇంట్లో. శ్రీధర్ భార్య వారిజ అతని పక్కనే కూర్చుంది. పిల్లలు ముగ్గురూ టి.వి. ప్రోగ్రాంల గురించీ, కొత్తరకం వంటకాలు చేసి పత్రికలకి పంపే వివరాల గురించీ మాట్లాడుకుంటున్నారు. సరిగ్గా ఆ సమయంలోనే పక్కింట్లోంచి పాట వినిపిస్తోంది. ఒక్కసారి ముగ్గురూ నిశ్శబ్దంగా వుండిపోయారు.

పక్కింటి రాఘవరావు ముందు ఈలపాటతో మొదలుపెట్టి తరువాత గొంతు విప్పాడు. వారిజ భర్తచేతిమీద లయబద్ధంగా తాళం వేస్తోంది. 'వారిజా నీకీ కృతి వచ్చుకదూ' శ్రీధర్ అడిగాడు. వారిజ పేలవంగా నవ్వింది. 'చిన్నప్పుడు మా టీచర్ అనేవారు ఆంధ్రులది ఆరంభ శూరత్వం అని ఎవరి మాటో ఎందుకుకానీ నా వరకూ అది నిజం.

కరెంటు లేకపోవడమే కాకుండా గాలికి క్రొవ్వొత్తులు కూడా ఆరిపోతున్నాయి. అయినా మళ్ళీ వెలిగించే ప్రయత్నం చేయలేదు. ఆ చీకట్లో, వర్షంలో, ఆ పాటలో లీనం అయిపోయారు. పక్కలమీద వాలిపోయి కళ్ళు మూసుకుని గాఢ నిద్రలోకి జారిపోయారు.

* * *

పిల్లలూ, భర్తా ఆఫీసుకు వెళ్ళాక తలుపులు వేసుకుంది వారిజ. పక్కింట్లో ఎందరో మహానుభావులు వినిపిస్తోంది. వారిజకి పని చేయాలని పించలేదు. ఎప్పుడూ వుండే పనే అది. వారిజ మనసు పురి విప్పిన నెమలి అయిపోయింది. పెట్టెలోంచి గజ్జెలు తీసుకుని కాళ్ళకి కట్టుకుంది. నగరంలో ప్రఖ్యాత నాట్యాచార్యుల దగ్గర ఆమె నాట్యం నేర్చుకుంది.

నిలువెత్తు అద్దంముందు నిలుచుంది. కాళ్ళ గజ్జెలు కనిపించేలా చీర కొంగు కొద్దిగా పైకి దోపింది. ఎదురుగా వున్న అద్దం ఆమె దృష్టిలో అశేష కళాభిమానుల ఆడిటోరియంలా కనిపిస్తోంది. ముందుగా నటరాజుకి నమస్కారంచేసి గురువుకి నమస్కరించింది.

నగుమోము, ఎందరో మహానుభావులూ మొదలైన కృతులేకాక అన్నమయ్య కీర్తనలు కూడా వినిపిస్తున్నాయి. గంట తరువాత పాటలు ఆగిపోయాయి. ఆమె మొహం నిండా చిరుచెమట్లు ఆక్రమించాయి. అక్కడవున్న కుర్చీలో అలసటగా నిద్రలోకి జారిపోయింది. చివరి రెండుసార్లూ ఆమెకు సిజరిన్ చేయడంవల్ల ఆరోగ్యం అంతగా ఆమెతో సహకరించడంలేదు.

సాయంత్రం పిల్లలు వచ్చారు. పిల్లలకి టిఫిన్, పాలు ఇచ్చింది. భర్త రాగానే కాఫీ అందించింది. అతను చేతిలో వున్న మల్లెపూల పొట్లం అందించి 'విశేషాలేమిటోయ్?' అని అడిగాడు.

'చెబుతాను' ఆమె కాఫీ తెచ్చుకుని జరిగింది పూర్తిగా చెప్పింది. పదిహేను రోజుల క్రితం ఈ కొత్త ఇంటికి వచ్చారు. వచ్చిన వారంరోజుల వరకూ ఇల్లు సర్దుకోవడంతోనే సరిపోయింది. నాలుగురోజుల క్రితమే పక్కింటి ఆవిడ పలకరించింది. ఆవిడ పిలుస్తే వాళ్ళింటికి వెళ్ళింది.

'మేమూ మీ వాళ్ళమే. నాకు మడీ తడీ, పూజా పునస్కారం ఎక్కువ. ప్రతి శుక్రవారం ముత్తయిదువకి పండు ఇచ్చుకోవడం అలవాటు. మీరు సంధ్యవేళ వచ్చి వెళ్ళండి' అంది ఆవిడ కలుపుగోలుగా.

**ఒకటికాదు రెండుకాదు వరుసగా ఆరునెలలు ఆయన పాడుతూండడం వారిజ డాన్స్‌చేయడం పరిపాటి అయిపోయింది. గజ్జెల శబ్దం విని ప్రహరీ గోడదగ్గర ఇరుగుపొరుగులు నిలుచుని కిటికీల్లోంచి చూడడం...**

రెండురోజుల క్రితం వెళ్ళి తాంబూలం తీసుకుంది. ఆవిడ వయసు ఎంతో లేకపోయినా ఆచారాలూ, విశ్వాసాలూ జీర్ణం చేసుకోవడంవల్ల వున్న వయసుకి పదేళ్ళు ముందున్నట్లు వుంది ఆవిడ.

వారిజకి ఆవిడ ధోరణి నచ్చలేదు. అయినా ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి అని సరిపెట్టుకుంది. ఆవిడ మళ్ళీ వారిజ దగ్గరకి రాలేదు. మడీ ఆచారం, పిల్లలతో 'కుదరదని' చెప్పేయడంతో బొత్తిగా ఆవిడ పలకరించడంలేదు.

శ్రీధర్ సిగరెట్ వెలిగించి 'థాంక్‌గాడ్ నీ చేత మళ్ళీ గజ్జెలు కట్టిస్తాననుకోలేదు. ఎందరో మహానుభావులు ఈ రూపంగా అయినా ఆయన పాటలు నీ ప్రాక్టీసుకి పనికి వస్తున్నాయి. ఆయన పాడినప్పుడు నువ్వు డాన్స్ చెయ్యడం మరిచిపోకు!' అన్నాడు హుషారుగా.

అతనికి తన భార్య మంచి డాన్సర్ అని తెలుసు. ఆవిడ చేత తిరిగి ప్రోగ్రామ్స్ ఇప్పించి ఆమెకి పేరు వచ్చేలా చేయాలని కలలుకంటున్నాడు. అతని మనసులో మాటకి దేవుడు వరం ఇచ్చినట్లు అయింది.

ఒకటి కాదు రెండు కాదు వరుసగా ఆరునెలలు ఆయన పాడుతూండడం వారిజ డాన్స్ చేయడం పరిపాటి అయిపోయింది. గజ్జెల శబ్దం విని ప్రహరీ గోడదగ్గర ఇరుగుపొరుగులు నిలుచుని కిటికీల్లోంచి చూడడం కూడా వారిజకి తెలియదు.

రాఘవరావు పాట ఆపలేదు. అతను చిన్నప్పటినుంచి ప్రఖ్యాత విద్వాంసులు దగ్గర సంగీతం నేర్చుకున్నాడు. అతను గొంతు విప్పి హృదయంలోంచి తదాత్మ్యం చెందుతూ పాడడంతో ఆ గజ్జెల మోత అతని పాలిట కచేరీలో వాద్య బృందం చేరినట్లు అనుభూతి కలగసాగింది. అతను తను వున్నది సామాన్యమైన ఇల్లు అనే సంగతి మరిచిపోయాడు. ఆర్థిక ఇబ్బందులూ, కుటుంబ భారం అతనికి అనుకూలించక పోవడంతో స్వంత ఖర్చులతో కచేరీలు ఇచ్చే స్తోమత లేకపోయింది. ఆ కారణంవల్ల అతను తాత్కాలికంగా నోరు మూసుకున్నాడు.

ఎప్పుడైతే వారిజా వాళ్ళూ పక్క ఇంట్లోకి వచ్చారో అప్పుడు కూడా అతనికి అంతగా తోచలేదు. ఓ వర్షపు రాత్రి అతనికి తెలియకుండానే అతనిలో త్యాగయ్య, క్షేత్రయ్యలు ఆవహించినట్లు అయింది. సరిగ్గా అప్పుడే అతను వర్షంలో ఆ శబ్దంలో కలిసిపోతుందన్న భ్రమతో పాటపాడాడు. అప్పటి నుంచీ పాడుతూనే ఉన్నాడు. అలా పాడుతూండగానే గజ్జెల శబ్దం వినిపించింది. లయబద్ధంగా వేస్తున్న అడుగులు అతని సంగీత సరస్వతి గుండె వాకిళ్ళు తలుపుతట్టాయి.



కాత్యాయిని జుట్టు విరబోసుకుని గబగబా వచ్చేసింది. అతని పాటా, ఆవిడ ఆటా ఆమె ఇన్నాళ్ళూ భరించింది. మొదట్లో అంతగా పట్టించుకోలేదు ఆవిడ. ఇరుగూ పొరుగూ ఇదేపనిగా ఆవిడ చెవుల్లో కథలల్లి గాఢంగా హత్తుకుపోయేట్లు చెప్పారు. శుక్రవారం తలంటుకున్న ఆమె భర్తపాట విని చరచరా ముందు గదిలోకి వచ్చేసింది.

రాఘవరావు కళ్ళు మూసుకుని జయదేవుడి అష్టపది పాడుతున్నాడు. ఆవిడ అతని భుజంమీద చేయివేసింది 'మీకేమైనా వళ్ళూ పైనా తెలుస్తోందా. అటుచూడండి' అని చూపించింది.

క్షణకాలం రాఘవరావుకి పరిస్థితి అర్థం కాలేదు. భార్య అవతారమే అతన్ని హడల గొట్టేస్తూంటే ఆవిడ ఏం చెబుతోందో ఎంతకీ అవగాహన కాలేదు.

కాత్యాయిని భళ్ళున తలుపు తెరిచింది. ఇరుగుపొరుగులు చిత్రంగా చూస్తున్నారు.

"ఆయనకేం మగవాడు. అసలునీకు బుద్ధివుందా? ఆయన పాట పాడడం సరే నువ్వు తైతక్కలాడడం సరే. చూడమ్మా. ఈ వాడలో వుండే వాళ్ళంతా సంసారం చేసుకుంటున్నవాళ్ళు. ఎన్నికథలు చదవలేదు. (?) ఎన్ని సినిమాలు చూడలేదు (?) మగవాణ్ణి చుట్టూ తిప్పుకుని ఏదో ఓ రోజున వుడాయించేసే ఆడవాళ్ళని. అయినా నీకిదేం పోయేకాలం? మొగుణ్ణి అటు పంపించి నువ్వు తందనాలాడడం ఏమైనా బాగుందా?

వారిజ తెల్లబోయింది. కాత్యాయిని చుట్టూ ఆడవాళ్ళున్నారు. పరీక్షలు రాసి ఇంటిపట్టున వున్న కుర్రకారు వెకిలిగా నవ్వుతున్నారు. వారిజ కళ్ళు బైర్లు కమ్మాయి. ఆమెకి ఏం జరుగుతోందో తెలియడం లేదు.

కాత్యాయిని శివమెత్తిన దానిలా రెండు చేతులూ జోడించింది. ఎప్పుడు తీసిందో ఆ చేతుల మధ్య మంగళ సూత్రాలున్నాయి. ఏడుస్తూ వారిజని బతిమాలుతోంది! నీకు పుణ్యం వుంటుంది తల్లీ. ఆ మహానుభావుడికి పిల్లలూ నేనూ తప్ప ప్రపంచంతో సంబంధంలేదు. నువ్విలా గజ్జె కడతావో లేదో ఆయన ప్రపంచాన్నే మరిచిపోతున్నారు. ఈ మాయలో పడిపోయి నన్నూ నా పిల్లల్నీ అన్యాయం చేస్తే మాకు ముందూ వెనుకా ఎవరూ లేరు. మేము అనాథలం అయిపోతాం తల్లీ?

వారిజ కుప్పలా కూలిపోయింది.

కాత్యాయిని మరో పదినిమిషాలు బతిమాలి, ఏడ్చి, తిట్టి తన ఇంట్లోకి వెళ్ళిపోయింది. ఆ సాయంత్రం వరకూ ఆమె నోరు మూతపడలేదు.

శ్రీధర్ వచ్చాడు. పిల్లలు వచ్చారు. వారిజ లేవలేదు. టైఫాయిడ్ వచ్చిన రోగిలా మంచానికి అతుక్కుపోయింది. వారిజ కళ్ళల్లోంచి కారిన కన్నీళ్ళకి తలగడ తడిసిపోయింది.

వారిజ ఇంటి ముందూ, రాఘవరావు ఇంటిముందూ ఇసుక వేస్తే రాలనంత జనం గుమిగూడి వున్నారు. శ్రీధర్ మొదట భయపడ్డాడు. అతనికేమీ అర్థం కాలేదు.

చీకటి పడిన తరువాత అతనికి అన్నివిషయాలూ అర్థం అయాయి. వారిజ పెదవి విప్పలేదు.

రోజూ మాదిరిగానే ఆ రోజూ తెల్లవారింది. అందరికీ తెల్లవారింది కానీ కాత్యాయిని బ్రతుకు మాత్రం తెల్లారిపోయింది. రాఘవరావు దూలానికి వ్రేల్లాడుతూ అందరికీ సాక్షాత్కారం చేశాడు.

పాలవాడు చెప్పగానే శ్రీధర్ నిర్ఘాంతపోయాడు. పోలీసులు వచ్చారు. పేపర్ వాళ్ళు ఫోటో గ్రాఫర్లూ సమస్త పరివారం అక్కడ హాజరయ్యారు. వారిజ మోకాళ్ళ మధ్యనుంచి తలపైకి ఎత్తలేదు.

ఇన్స్పెక్టర్ వుత్తరం తీసి చదివాడు. అది రాఘవరావు జేబులో దొరికింది.

డియర్ కాత్యాయినీ:

నువ్వు ఇలా ప్రవర్తిస్తావని తెలియదునాకు. నేను గాయకుడిని. ఆమె నర్తకి. ఇద్దరం ఇరుగు పొరుగు ఇళ్ళల్లో వుండడం మేము చేసుకున్న పాపం. అభం శుభం తెలియని సాటిస్త్రీని పదిమందిలో ఎన్నెన్ని మాటలన్నావు. నాముందే నన్ను నోరెత్తనీయకుండా నువ్వు చేసిన ఈ పని ఎవరైనా క్షమిస్తారేమో కానీ నేను క్షమించలేను.

నాకు నువ్వు తప్ప మరే స్త్రీకూడా స్త్రీమూర్తిగా కనిపించదు. కళా హృదయం తెలిసిన వాళ్ళకి వివరంగా చెప్పవచ్చును కానీ నీలాంటి మూఢ విశ్వాసాలకి బలైపోయే స్త్రీల కళ్ళు తెరవడం నావంటి వాడికి తెలియదు. నీకు ఎటువంటి శిక్ష వేయాలో రాత్రంతా ఆలోచించినా అర్థం కాలేదు. దీనికి పరిష్కారం నిన్ను ఒంటరిదాన్ని చేయడమే అనే నిర్ణయానికి వచ్చాను. చదువు నేర్పిన సంస్కారం నీ మడీ ఆచారాల అంధకారంలో నిన్ను పైకి రానీయలేదు.

ఆ పిల్లను అన్యాయంగా అన్న ఫలితం నువ్వు అనుభవించు. సెలవ్.

—రాఘవరావ్.

శ్రీధర్‌కి కళ్ళు చెమర్చాయి. ఎంతటి సున్నిత హృదయుడు? మహానుభావులు ఎందరో... అందులో మీరూ వున్నారు రాఘవరావ్‌గారూ అనుకున్నాడు.

నెల తిరక్కుండా వారిజతో అతను మరో ప్రదేశానికి మకాం మార్చాడు.

వారిజ మామూలు మనిషి అయేందుకు చాలా కాలం పట్టింది. అయినా ఏం లాభం? రేడియోలో పాటవిన్నా, టి.వీలో నాట్యం చూసినా హిస్టీరియా వస్తుంది ఆమెకి.

అందుకే అతను ప్రశాంతంగా ఓ మారుమూల ప్రదేశంలో వుంటున్నాడు. వారిజ ఇప్పుడు షోకేస్‌లో ఖరీదైన బొమ్మ.

*



### ఇంటర్‌వ్యూ

రైల్ రోడ్ క్రాసింగ్ వద్ద ఉండే వాచ్‌మన్ పోస్టుకు ఇంటర్‌వ్యూ జరుగుతోంది.

రెండు రైళ్ళు ఒకే పట్టామీద ఎదురెదురుగా వస్తున్నట్లు చూడగానే ఏం చేస్తావు?'' రేవంత్‌ను అడిగాడు ఓ సభ్యుడు.

''చేతిలో ఉన్న ఎర్రలాంతర్‌ను ఊపుతాను!''

''అది రాత్రి సమయం! నీ చొక్కా కన్పించదు.. అపుడు''

''మాచెల్లెల్నిపిలుస్తాను! రెండు రైళ్ళు గుద్దుకున్నపుడు ఎలా ఉంటుందో చూడాలని అదెప్పటినుండో సరదా పడుతోంది'' కసిగా అన్నాడు రేవంత్.

జోకర్ (హైదరాబాద్)


" రుబ్బుడు రోలు రుబ్బుడు రోలే "

ఐనప్పటికీ మీరు క్రొత్త సిపిసి ప్రీమియర్
వెట్‌గ్రైండరును యింతవరకు చూచి వుండలేదు గదా



తిన్నని విధమైన గ్రైండరు

మీరు చెప్పేది ఒక విధంగా నిజమే కూడా—మూడు వంతుల వెట్ గ్రైండర్లలో, పిండి రుబ్బితే, రుబ్బుడు రోలులో రుబ్బిన మాదిరిగా రాదు – సిపిసి ప్రీమియర్‌లో తప్పించి.

అతి పరామరికతో తయారు చేయబడ్డ యిది, మీ సకల విధములైన ఆవశ్యకతలను దృష్టిలో వుంచుకొని రూపొందించబడింది.

బాగా ఎక్కువ బరువును భరించగల శక్తివంతమైన బాల్ బేరింగు, సులువుగా కక్కు అరిగిపోని దారుఢ్యమైన రుబ్బుడు పత్రం, దీర్ఘకాలం సేవ చేయ ఆదాయకరమైన సిపిసి ప్రీమియర్ మోటారు, దృఢమైన ఎవర్‌సిల్వర్ బేసిన్, క్రోమియం పూత పూయబడిన భాగములు, సులువుగా శుభ్రం చేసుకొనేందుకు అందమైన బాడీ. కదలకుండా నిశ్చలంగా వుండగలందులకు గొట్టములతో నిర్మించబడ్డ కాళ్ళు. వీనిని పొందివున్నవి సిపిసి ప్రీమియర్ గ్రైండర్లు.



వంచే విధమైన గ్రైండరు

వీటన్నిటికన్నా మిన్నగా : ఒక సంవత్సరం గ్యారంటీ.

కోయంబత్తూరు, మద్రాసు, మదురై, తిరుచ్చి, విల్లుపురం, కొచ్చిన్, చిత్తూరు, సికిందరాబాదు, బెంగుళూరు మొదలగు పట్టణాలలో గల మా కంపెనీ శాఖలలోనూ, మరితర ప్రాంతములలో మా చే అంగీకరించబడ్డ వ్యాపారులందరి వద్ద లభించగలవు.

సిపిసి ప్రీమియర్

నూతన పసతులు, పురాతన పక్వము సమన్వయంగా ఒనగూడినది.

సిపిసి (పి) లిట్
కోయంబత్తూరు-641 030.

మంచి వెట్‌గ్రైండర్ ఎంచుకోవడం ఎలాగో మా కరపత్రం తెలుపుతుంది. మాకు రాయండి. ఉచితంగా పంపిస్తాం.

OBM-9365 TG